క్లుప్తంగా

మర్రిఆకుపై నృసింహుడు



పెంచల నృసింహుడి జయంతిని పురస్కరించుకొని విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య మర్రి ఆకుపై నరసింహస్వామి చిత్రాన్ని రూపొందించారు.

– పొదలకూరు

అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు

- సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి

నెల్లూరు (పొగతోట) : అర్హులందరూ కొత్త రేషన్ కార్డుల కోసం సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సివిల్‌సప్లయ్స్ సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. ఆయన శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 7 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. 21 రోజుల్లోపు కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఏడు రకాల సర్వీసులను కల్పించి కొత్త కార్డు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 2,342 మంది కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటును సంప్రదిస్తే దరఖాస్తు చేస్తారన్నారు. ఈకేవైసీ ద్వారా జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష బోగస్ రేషన్‌కార్డులను గుర్తించి తొలగించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 6.23 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే డీఎస్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 99517 78716 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. ఎండీయూ వాహనాల విషయంలో త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



నెల్లూరు(అర్బన్) : వైద్య, ఆరోగ్యశాఖతో పాటు సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న పలు క్యాడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్, హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులతో కలిసి మంత్రి పొంగూరు నారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న వార్డ్ అడ్మిన్స్‌కు సీనియర్ అసిస్టెంట్ స్థాయిలో వార్డు ఆఫీసర్లుగా పదోన్నతలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల సభ్యులు సతీష్‌రెడ్డి, బాలరాజు, అరవ పరిమళ, హరిప్రసాద్, వెంకటేష్, అశోక్, విజయలక్ష్మి, బ్రహ్మేశ్వరి, శివతేజ, కామాక్షి, శ్రీను, రమేష్, మోహన్, రాజశేఖర్, మొహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

నెల్లూరు సిటీ : ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించనున్నట్లు రూరల్ ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న పెనుబర్తి, కాకుపల్లి, కలివేలపాళెం, మాదరాజుగూడూరు గ్రామాల్లోని గిరిజనులకు కాకుపల్లి బిట్- 2 సచివాలయంలో క్యాంప్ ఉంటుందన్నారు. 13న పొట్టేపాళెం, కొండ్లపూడిలోని గిరిజనులకు పొట్టేపాళెం సచివాలయంలో, 14న కొమ్మరపూడి, దేవరపాళెం, ములుమూడి గిరిజనులకు ములుమూడి సచివాలయంలో, 15న సౌత్‌మోపూరు గిరిజనులకు స్థానిక సచివాలయంలో, 16న కందమూరు, ఉప్పుటూరు గిరిజనులకు కందమూరు సచివాలయంలో, 17న కొత్తవెల్లంటి, పాత వెల్లంటి, సజ్జాపురం, గొల్లకొందుకూరు గిరిజనులకు వెల్లంటి సచివాలయంలో, ఆమంచర్ల, దొంతాలి గిరిజనులకు ఆమంచర్ల సచివాలయంలో ఆధార్ నమోదు క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు.

తమ్ముళ్ల బరితెగింపు

- యథేచ్ఛగా గ్రావెల్ దందా
- టీడీపీ ఇన్‌చార్జి నోటి మాటతోనే అనుమతి
- రోడ్డు పనులకు ఇష్టానుసారంగా తరలింపు
- కాంట్రాక్టర్‌లూ వారే



గొపాలపురంలో అక్రమంగా సాగిస్తున్న గ్రావెల్ తవ్వకాలు

అధికారం అడ్డం పెట్టుకొని తెలుగు తమ్ముళ్లు బరి తెగిస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా టీడీపీ ఇన్‌చార్జి మాటే అనుమతిగా గ్రావెల్‌ను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కావడంతో అధికారులు కూడా చూసి చూడనట్లు పోతున్నారు. కొడవలూరు మండలం కొత్తవంగల్లు పంచాయతీ పరిధిలోని గోపాలపురంలో తమ్ముళ్ల గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

కొడవలూరు: కొత్తవంగల్లుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఇంకొందరు కార్యకర్తలతో కలిసి బుచ్చి, దగదర్తి రోడ్డు నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఈ పనులకు గ్రావెల్ అవసరం కావడంతో అక్రమంగా గ్రావెల్ తరలింపునకు శ్రీకారం చుట్టారు. నిబంధనల ప్రకారమైతే అనుమతులు పొంది పన్నులు చెల్లించాలి. నిబంధనల మేరకే తవ్వాలి. అధికార పార్టీ నాయకులు కావడంతో అడిగేవారేవరన్న ధీమాతో కొత్తవంగల్లు గోపాలపురంలో గ్రావెల్ తవ్వకాలు చేసి రోడ్డు పనులకు తరలిస్తున్నారు. ఇష్టానుసారం టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తుండడంతో స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలపై వీఆర్‌ఏ ఘటనా స్థలానికి చేరుకుని అనుమతుల విషయమై ప్రశ్నించారు. మండల టీడీపీ ఇన్‌చార్జి తవ్వుకోమన్నారని, ఆయన చెబితే అనుమతులు అవసరం లేదంటూ వీఆర్‌ఏపై ఆ టీడీపీ నాయకుడు చిందులు తొక్కడం గమనార్హం.

అడిగేవారేరీ?

తెలుగు తమ్ముళ్లు గ్రావెల్ తవ్వుతున్న ఈ భూములను గతంలో దళితులకు సాగు చేసుకుని జీవించేందుకు ప్రభుత్వం ఇచ్చిందని, అక్కడ గ్రావెల్ తవ్వకాలు చేసే హక్కు ఎవరికీ ఉండదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కానీ టీడీపీ నాయకులకు ఇవేమీ పట్టడం లేదు. అధికారం ఉంటే ఏం చేసినా అడిగేవారు లేరన్నట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కోవూరు నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలు చేయనివ్వనని స్పష్టం చేసి ఉన్నారు. అయితే ఆ పార్టీ నేతలు అవేమీ ఖాతరు చేయకుండా ఇష్టం వచ్చినట్లు గ్రావెల్ దందాలకు పాల్పడుతున్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



ప్రసన్నతో రామతీర్థం గ్రామస్తులు

విడవలూరు: కష్టకాలంలో పార్టీ జెండా మోసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారికి అన్నివిధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామతీర్థం పంచాయతీకి చెందిన పలువురు నాయకులు ప్రసన్నను నెల్లూరులోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాబోయే రోజుల్లో మండలంలో పార్టీ మరింత బలపడే దిశగా అడుగులు వేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, కరుణాకర్, హరి, రాధయ్య, చెంచులు, సుధాకర్, కోటయ్య, బాషా, జయప్రకాష్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న విశ్వేశ్వరునికి రావణసేవ



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి రావణసేవ శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరిగించారు. భక్తులు పండ్లు, కొబ్బరికాయ, కర్పూర హారతులు ఇచ్చి స్వామివారిని వేడుకున్నారు. అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయకర్తలుగా బొద్దుకూరు శ్రీనివాసులు– ప్రసన్న దంపతులు వ్యవహరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం



నార్తురాజుపాళెంలో..

కొడవలూరు : మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో తల్లులకు వారి పిల్లలతో వందనం చేయించారు. అనంతరం తల్లులను సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. తల్లులను ఉద్దేశించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ తల్లులను పిల్లలు గౌరవించే పద్ధతిని చిన్నతనం నుంచే నేర్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త యాస్మిన్ పాల్గొన్నారు.



కొడవలూరు ఎన్టీఆర్ కాలనీలో తల్లికి వందనం చేస్తున్న చిన్నారులు

నార్తురాజుపాళెంలో..

నార్తురాజుపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు తల్లులకు వందనం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై.రాజమ్మ, ఎన్.సుదర్శన, వై.మంజుల పాల్గొన్నారు.

యల్లాయపాళెంలో..

స్థానిక శ్రీనివాసపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ తల్లిదండ్రుల పట్ల పిల్లల్లో గౌరవం పెరిగేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.



యల్లాయపాళెంలో..

కోలాహలంగా శోభాయాత్ర



పొదలకూరు: పట్టణంలోని రామాలయ నిర్మాణ శంకుస్థాపనను పురస్కరించుకొని శోభాయాత్రను రామభక్తులు శనివారం నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను విశేషంగా అలంకరించారు. రామమందిర సెంటర్ నుంచి రామనగర్ గేట్ సెంటర్.. అక్కడి నుంచి బస్టాండ్ వరకు శోభాయాత్రను జరిపారు. సీతారాముల పటాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. రామాలయ నిర్మాణానికి శంకుస్థాపనను ఆదివారం ఉదయం 6.54కు నిర్వహించనున్నామని భక్తులు వెల్లడించారు.



మున్సిపల్ అధ్యక్షురాలిగా అనంతమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా బుచ్చిరెడ్డిపాళెం 15వ వార్డు కౌన్సిలర్ కంటా అనంతమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో ఈ విషయాన్ని శనివారం వెల్లడించారు.

జైహింద్..



భరతమాతకు సెల్యూట్ చేస్తున్న పిల్లలు

పొదలకూరు: భారత్ – పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పిల్లల్లో దేశభక్తిని అంగన్‌వాడీ టీచర్ నింపుతున్నారు. మండలంలోని మొగళ్లూరు ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సైనిక దుస్తులను వేయించి భరతమాత చిత్రాన్ని రూపొందించి జైహింద్ పలికించారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు

పొదలకూరు: మండల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్ల నుంచి వ్యవసాయ యోగ్యమైన (త్రీ ఫేజ్ – గ్రూప్ బీ) వేళల్లో మార్పులు చేసి ఆదివారం నుంచి అమలు చేయనున్నామని ఏఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఉదయం 8.45 నుంచి సాయంత్రం 5.45 వరకు వ్యవసాయ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇక ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు సరఫరా చేయనున్నామని, రైతులు గమనించాలని కోరారు.

పుచ్చతోట కట్టువ దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరులో పుచ్చతోట కట్టువ శనివారం దగ్ధమైంది. గ్రామస్తుల కథనం మేరకు.. రైతు గోపాల్‌కు చెందిన పుచ్చతోట కట్టువకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలను అదుపు చేశారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో పూజలను శనివారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా వజ్జా పంచలరెడ్డి, ప్రమీలమ్మ దంపతులు, ప్రవీణ్‌రెడ్డి వ్యవహరించారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో కొలువైన శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నేడు

పెనుశిల లక్ష్మీనృసింహుడి జయంతిని పురస్కరించుకొని దేవస్థానంలో స్వామివారి కల్యాణాన్ని ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

వినియోగంలోకి సంపద కేంద్రాలు



కొడవలూరు కేంద్రానికి పూర్వ వైభవం

సాక్షి ఎఫెక్ట్..

కొడవలూరు: మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చారు. మండలంలో 12 సంపద కేంద్రాలుండగా అన్నీ ఆలనాపాలనా కరువై నిరుపయోగంగా మారాయి. దీనిపై గత నెల 28న 'అటకెక్కిన సంపద సృష్టి' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా పంచాయతీ అధికారులు, మండలాధికారులు స్పందించారు. ప్రత్యేక దృష్టి సారించి అన్ని కేంద్రాలను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. కేవలం షెడ్డులు, తొట్టెల నిర్మాణాలకే పరిమితమై ఉన్న బసవాయపాళెం, పెయ్యలపాళెం, యల్లాయపాళెం, రామన్నపాళెం తదితర కేంద్రాలకు సైతం నిధులు వెచ్చించి శుభ్రం చేయించారు. తొట్టెలలో వానపాముల ఎరువు ఉత్పత్తికి చర్యలు తీసుకున్నారు. మండలంలోని 12 కేంద్రాలకు కొత్త రూపు తీసుకొచ్చారు. అన్నింటిలోనూ వానపాముల ఎరువు ఉత్పత్తి మొదలైంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కె.మురళి మాట్లాడుతూ మండలంలో ఏ ఒక్క కేంద్రం నిరుపయోగంగా ఉండరాదంటూ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ కనబరచారన్నారు.



పెయ్యలపాళెం కేంద్రంలో వానపాముల ఎరువు ఉత్పత్తికి ఏర్పాట్లు



గౌతమ్‌నగర్ కేంద్రానికి కొత్తరూపు

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ గౌస్‌బాషాతో పాటు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. గౌస్‌బాషా తండ్రి రషీద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో లేబూరులోని వారి నివాసానికి ప్రసన్న వెళ్లి పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, నాయకులు వరిగొండ బాబయ్య, శ్రావణ్‌కుమార్, పి.హరి, సుభాహన్, మహబూబ్‌జానీ, నిజాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. ప్రకృతి వ్యవసాయమే లక్ష్యం

- ఉడుపి అడమారు మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థానంద
- పొదలకూరు చేరిన పాదయాత్ర



ప్రత్యేక పూజలు చేస్తున్న ఈషాప్రియ తీర్థానంద

పొదలకూరు: ప్లాస్టిక్ నిషేధం, ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా 300 కిలోమీటర్ల పాదయాత్రను నిర్వహిస్తున్నానని ఉడుపి అడమారు మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థానంద పేర్కొన్నారు. హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా తమిళనాడులోని షోలింగూర్ కృష్ణమఠం నుంచి పాదయాత్రను గత నెల్లో ప్రారంభించామని తెలిపారు. పొదలకూరు గేట్ సెంటర్‌కు చేరుకోవడంతో స్థానికులు స్వాగతం పలికి కల్యాణ మండపంలో బస ఏర్పాటు చేశారు. 800 ఏళ్ల నాటి పురాతన కృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలను శనివారం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో దుష్పరిణామాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేస్తే తద్వారా అందే ఆహారంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గోవుల సంరక్షణ, గ్రామాల్లో చేతివృత్తుల వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనాలంటే సనాతన ధర్మాన్ని పాటించాలని పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం నెల్లూరు పయనమయ్యారు.